**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


విజయవాడ,

తేది : 8 జూన్, 2020.

**శ్రీయుత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గారికి,**

గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము,
వెలగపూడి.

**ప్రచురణార్థం:** సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ముఖ్యమంత్రిని కలిసి ఇచ్చిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం. **– జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

**విషయం :** **భవన నిర్మాణ కార్మికుల ఉపాధి, ఇసుక, కరోనా రెడ్‌జోన్, క్వారంటైన్ సమస్యలు నివారణ, ఉపాధి హామీ, కౌలురైతు సమస్యల పరిష్కారం నిమిత్తం...**

**ఆర్యా!**

**(1)** అసంఘటితరంగంలో ఎక్కువమందికి ఉపాధి లభిస్తున్నది భవన నిర్మాణ రంగం. అనేక కారణాల వల్ల వీళ్ళ ఉపాధి కరోనా కంటే ముందే తగ్గింది. ఈ నేపథ్యంలో కరోనా వైరస్, లాక్‌డౌన్ కారణాల వల్ల ఆర్థిక కార్యకలాపాలు స్థంభించిపోయాయి. భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఈ పరిస్థితుల్లో భవన నిర్మాణ కార్మికులకు వారి సంక్షేమ నిధి నుండి తక్షణం ఒక్కొక్క కార్మికుడికి రూ.10 వేలు చొప్పున కనీసం 3 మాసాలు ఆర్థిక సహాయం చేయాలి. అలాగే ఇసుక సరఫరాలో నెలకొన్న అవకతవకలను అరికట్టి సామాన్యుడికి అందుబాటులోకి వచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

**(2)** కరోనా వ్యాధి నుండి రక్షణ కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం టెస్టులు నిర్వహించడంలో మొదటి స్థానంలోనే ఉన్నది. కంటైన్‌మెంటు, రెడ్‌జోన్ ఏరియాల్లో స్థానికులకు నిత్యావసరాలు అందుబాటులోకి రావడంలేదు. నిత్యావసర వస్తువులు అవసరమైన వారికి అందించే చర్యలు వెంటనే తీసుకోవాలి. రెడ్‌జోన్‌లోగానీ క్వారంటైన్ కేంద్రాల్లోగానీ పోలీసుల జోక్యం ఎక్కువైంది. దీనిని నివారించి సరైన భోజనం, శానిటేషన్ సౌకర్యం లాంటివి కల్పించాలని కోరుతున్నాం.

**(3)** కౌలురైతులు, వ్యవసాయ కూలీలు కరోనా, లాక్‌డౌన్‌తో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధిహామీ పనులు 200 రోజులు పని కల్పించాలి. కౌలురైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయడంలో జాప్యం జరిగింది. కావున గ్రామ సచివాలయ వలంటీర్ల ద్వారా కౌలుదార్లందరికీ కార్డులిప్పించే ఏర్పాటు చేయాల్సిందిగా కోరుతున్నాము.

**(4)** తమరు రైతు భరోసా ప్రకటించాక పట్టణాల్లో కూడా ఉపాధి భరోసా లాంటిది ఒకటి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని ప్రజలు కోరుతున్నారు.

**(5)** అసంఘటితరంగంలో కార్మికులు సుమారు 50-60 లక్షల మంది ఉన్నారు. వీరికి పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు గత 15 సం॥లుగా సవరించబడలేదు. "మినిమమ్ వేజెస్ అడ్వయిజరీ బోర్డు" సిఫార్సు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇవాల్సి ఉంది. గత ప్రభుత్వ కాలంలో ఈ పని జరగలేదు. ఇప్పుడు మీరయినా ఈ పని చేయించాలని కార్మికులు కోరుతున్నారు.

పై విషయాలను సానుభూతితో పరిశీలిస్తారని ఆశిస్తున్నాము.

అభివందనములతో...

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి